క్లుప్తంగా

అందరివాడు అంబేడ్కర్


పెదపేట అంబేడ్కర్ జయంతిలో పాల్గొన్న ఎస్సై హరికోటిశాస్త్రి

అయినవిల్లి: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అందరివాడు అని.. ఆయన సేవలు సూర్యచంద్రులు ఉన్నంత కాలం గుర్తించుకుంటారని స్థానిక ఎస్సై హరికోటి శాస్త్రి అన్నారు. బుధవారం మండలంలోని అయినవిల్లి పెదపేటలో అంబేడ్కర్ జయంతిని జరిపారు. ఎస్సై తొలుత అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గ్రామంలో డప్పు వాయిద్యాలు, బుట్టబొమ్మలు, తీన్‌మార్ వంటి వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాలు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ కాకర శ్రీనివాస్, పి.గన్నవరం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్, అయినవిల్లి మండల జెడ్పీటీసీ గన్నవరపు శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ బయ్యా చినబాబు, నీటి సంఘం అధ్యక్షుడు కాకర శ్రీను, నాయకులు బడుగు వెంకటేశ్వర రావు(అగ్ని) తదితరులు పాల్గొన్నారు. అలాగే తొత్తరమూడి, శానపల్లిలంక గ్రామాల్లో అంబేడ్కర్ జయంతిని జరిపారు.

వైభవంగా పంచామృత అభిషేకాలు


ఆలయం వద్ద అభిషేకాలు నిర్వహిస్తున్న భక్తులు

మలికిపురం: మలికిపురం హరిహరసుత అయ్యప్ప స్వామి ఆలయం వద్ద బుధవారం పంచామృత అభిషేకాలు వైభవంగా జరిగాయి. పూజారి నంబూద్రి నందన్ ఆధ్వర్యంలో ఉదయం నుంచీ అనేక మంది దంపతులు, భక్తులు అభిషేకాల్లో పాల్గొని ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు జరిగాయి.

కోనసీమ కాంగ్రెస్ జిల్లా కమిటీ ప్రకటన

మామిడికుదురు: కోనసీమ జిల్లా కాంగ్రెస్ కమిటీని అధ్యక్షుడు కొండేటి చిట్టిబాబు బుధవారం ప్రకటించారు. నగరం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, కార్యదర్శులను ప్రటించి వారికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఏడుగురు జిల్లా ఉపాధ్యక్షులు, ఎనిమిది మంది ప్రధాన కార్యదర్శులు, ఒక జిల్లా కార్యదర్శి మొత్తం 16 మంది జిల్లా కమిటీ ప్రతినిధులను ప్రకటించారు. కార్యక్రమంలో పార్టీ నేతలు పాల్గొన్నారు.

40 నెలల నుంచి జీతం ఇవ్వడం లేదు


మతగురువు షబ్బర్ అలీ జైదీ

మామిడికుదురు: నలభై నెలల నుంచి జీతం ఇవ్వకుండా కమిటీ ఇబ్బంది పెడుతోందని మామిడికుదురు నస్రుమినల్లా షియా మసీదు ఇమామ్ సయ్యద్ షబ్బర్ అలీ జైదీ ఆవేదన వ్యక్తం చేశారు. మామిడికుదురులో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన తన ఆవేదన వ్యక్తం చేశారు. ఉత్తరప్రదేశ్‌లోని లక్నో నుంచి వచ్చి 25 సంవత్సరాల నుంచి ఇమామ్‌గా బోధనలు చేస్తున్నానన్నారు. నెలకు రూ.7 వేల జీతం ఇస్తున్నారని చెప్పారు. 2022 జనవరి నుంచి 40 నెలలకు సంబంధించిన జీతం రూ.2.40 లక్షలు తనకు రావాల్సి ఉందన్నారు. కమిటీ జీతం ఇవ్వకపోవడంతో తన జీవనోపాధికి తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. దీనిపై జిల్లా కలెక్టర్‌కు 2024 నవంబరు 18న, ఈ నెల 28న ఫిర్యాదు చేశానని చెప్పారు. దీంతో పాటు విజయవాడలోని వక్ఫ్ బోర్డు సీఈఓకు కూడా ఫిర్యాదు చేశానన్నారు. తనకు రావాల్సిన జీతం తక్షణం ఇప్పించే విధంగా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని ఇమామ్ షబ్బర్ అలీ జైదీ కోరారు. సమావేశంలో నగరం ఉప సర్పంచ్ అన్వర్ తాహిర్ హుస్సేన్, ఎండీ తఖీ, ఇలియాస్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రదాడికి వ్యతిరేకంగా ర్యాలీ



సదస్సులో అవగాహన కల్పిస్తున్న ఆర్‌వి నాయుడు

అయినవిల్లి: పహల్గామ్ ఉగ్రదాడికి వ్యతిరేకంగా తొత్తరమూడి గ్రామ పంచాయతీ పరిధిలో సర్పంచ్ వార జయసావిత్రి ఆధ్వర్యంలో బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. పాకిస్తాన్ డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేశారు. అనంతరం పౌర హక్కుల దినోత్సవం జరిపారు. ఎస్సీ, ఎస్టీ చట్టం, వంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఆర్‌వి నాయుడు, పంచాయతీ కార్యదర్శి గరిమెల్ల రవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పదేళ్లుగా సాగుతున్న శ్మశాన వాటిక వివాదం

- నిలిచిన జాతీయ రహదారి పనులు
- ప్రత్యామ్నాయ స్థలం కోసం డిమాండ్


గెద్దాడలో వివాదం కారణంగా నిలిచిన ఎన్‌హెచ్ పనులు

మామిడికుదురు: 216వ నంబర్ జాతీయ రహదారి బైపాస్ రోడ్డు నిర్మాణంలో భాగంగా గెద్దాడ గ్రామంలోని సర్వే నంబర్ 42లో 1.38 ఎకరాల శ్మశానవాటిక స్థలం మొత్తం కనుమరుగు కానుంది. శ్మశానవాటిక మొత్తం కోల్పోవడంపై స్థానికులు తీవ్రంగా మండిపడుతున్నారు. బైపాస్ రోడ్డుకు శ్మశానవాటికకు చెందిన ఎంత స్థలం తీసుకుంటున్నారో అంతే స్థలం తమ గ్రామంలోనే, తాము సూచిస్తున్న ప్రాంతంలో ఒకే చోట ఇవ్వాలంటూ గ్రామస్తులు పదేళ్ల నుంచి పోరాటం చేస్తున్నారు. కానీ దీనిపై ఇంత వరకు జాతీయ రహదారుల విభాగం అధికారులు స్పష్టత ఇవ్వలేకపోయారు. సమస్యనూ పరిష్కరించలేకపోయారు. అధికారులు రావడం, వెళ్లడం తప్ప ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపలేకపోయారు. దీంతో ఈ ప్రాంతంలో బైపాస్ రోడ్డు నిర్మాణం నిలిచిపోయింది.

కోర్టు స్టేతో భూ సేకరణకు ఆటంకం

అదే గ్రామంలోని బైపాస్ రోడ్డు పక్కనే ఉన్న ప్రైవేటు స్థలం 1.10 ఎకరాలు సేకరించి శ్మశాన వాటికకు ఇవ్వాలని అధికారులు గతంలో నిర్ణయించారు. కానీ ఈ భూమికి సంబంధించిన యజమానులు కోర్టు నుంచి స్టే పొందడంతో ప్రైవేటు స్థల సేకరణకు ఆటంకం కలిగింది. స్టేను ఉపసంహరించుకోవాలంటూ అధికారులు ప్రైవేటు స్థలం యజమానులపై ఒత్తిడి తీసుకువస్తున్నా వారు ససేమిరా అంటున్నారు. దీంతో వివాదం పరిష్కారానికి నోచుకోవడం లేదు. తమది చిన్న గ్రామమని, అన్ని కులాలకు సంబంధించి గ్రామానికి ఒకటే శ్మశానవాటిక ఉందని, బైపాస్ రోడ్డుతో దాన్ని కోల్పోతున్నామంటూ స్థానికులు తీవ్రంగా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు కాలయాపన చేయకుండా ప్రైవేటు స్థలాన్ని సేకరించి ఇచ్చిన తర్వాతే బైపాస్ రోడ్డు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ సమస్య పరిష్కారంపై అధికారులు సత్వరం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

స్థలం కేటాయించాలి



మా గ్రామంలోని 1.38 ఎకరాల స్థలాన్ని బైపాస్ రోడ్డుకు తీసుకోవాలని నిర్ణయించారు. దీని వల్ల మా గ్రామంలో ఎవరైనా చనిపోతే శవాలకు అంత్యక్రియలు నిర్వహించేందుకు స్థలం లేకుండా పోతుంది. దీనిపై మేము మొదటి నుంచి పోరాటం చేస్తున్నాం. ఎంత స్థలం తీసుకుంటున్నారో అంతే స్థలం ప్రైవేటు ల్యాండ్ తీసుకుని ఇవ్వాలని కోరుతున్నాం. కానీ దీనిపై అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబిస్తున్నారు. మా సమస్య పరిష్కారంపై శ్రద్ధ చూపడం లేదు. దీన్ని త్వరగా పరిష్కరించాలి.

– సుంకర నాగభూషణం, గెద్దాడ

ఒత్తిడి కాదు పరిష్కారం కావాలి



మా మీద ఒత్తిడి తెచ్చి సమస్య పరిష్కారం కాకుండానే బైపాస్ రోడ్డు నిర్మించాలని అధికారులు ప్రయత్నిస్తున్నారు. మేము కోరుకునేది ఇది కాదు. మా సమస్యను శాశ్వతంగా పరిష్కరించండి. ఒత్తిడి తేవడం వల్ల సమస్య జటిలమవుతుంది తప్ప ఎన్నటికీ పరిష్కారం కాదు. దీనిపై ఇప్పటికైనా శ్రద్ధ చూపాలని కోరుతున్నాం. ఇప్పటికే పదేళ్లుగా సమస్య కొనసాగుతుంది. దీన్ని సాగదీయడం కాకుండా పరిష్కారానికి అధికారులు చొరవ చూపాలి. ఆ దిశగా ముందుకు వెళ్లాలని కోరుతున్నాం.

– ఇంజేటి వెంకటరమణ, గెద్దాడ

పరిష్కారంపై శ్రద్ధ లేదు



అధికారులు వస్తున్నారు. వెళ్తున్నారు. ఎంతో మంది ఉన్నతాధికారులు వచ్చారు. బదిలీపై వెళ్లారు. కానీ మా సమస్య మాత్రం పరిష్కారానికి నోచుకోలేదు. మళ్లీ, మళ్లీ సమస్య మొదటికే వస్తోంది. ఈ పీకులాట ఎందుకో అర్థం కాని పరిస్థితి. దీనిపై అధికారులకు శ్రద్ధ ఉన్నట్లు ఎక్కడా కనిపించడం లేదు. దీన్ని సీరియస్‌గా తీసుకోవాలి. ఇళ్లకు దగ్గరలో కాకుండా బైపాస్ రోడ్డు పక్కనే శ్మశాన వాటికకు స్థలం కేటాయించాలి. తద్వారా సమస్యకు పరిష్కార మార్గం చూపాలి.

– అనుమూరి సత్యనారాయణ, గెద్దాడ

జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలి


వక్కలంకలో ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను అందిస్తున్న సర్పంచ్ రేవతి

అంబాజీపేట: జాతీయ ఉపాధి హామీ పథకంలో పనిచేసే ఉపాధి కూలీలు వడగాడ్పులకు గురికాకుండా తగు జాగ్రత్తలు పాటిస్తూ పనులు చేసుకోవాలని సర్పంచ్ వాసంశెట్టి రేవతి అన్నారు. వక్కలంకలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను బుధవారం సర్పంచ్ పరిశీలించారు. ఉపాధి కూలీలకు ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లను అందజేశారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం ఎ.సరోజని, ఎంపీహెచ్‌ఏ పి.యేసుబాబు పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు ట్రై సైకిళ్ల పంపిణీ

పి.గన్నవరం: నియోజకవర్గంలోని భవిత కేంద్రాల్లో చదువుతున్న విభిన్న ప్రతిభావంతులైన విద్యార్థులకు బుధవారం పి.గన్నవరంలోని తన కార్యాలయం వద్ద ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ ట్రై సైకిళ్లు, వీల్ చైర్లు, సీపీ చైర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, ఎంఈఓలు కోన హెలీనా, చింతా వీరభద్రానందం, సర్పంచ్ బొండాడ నాగమణి, నాయకులు డీవీవీ సత్యనారాయణ, సాధనాల వెంకట సత్యనారాయణ, యడ్ల ఏసు, శేరు శ్రీనుబాబు, చొల్లంగి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆంక్షలు సడలించాలని రైతుల నిరసన


తాటిపాకలో ధాన్యం లోడుతో నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు


రైతులకు మద్దతు తెలిపిన మాజీ మంత్రి గొల్లపల్లి

- ధాన్యం కొనుగోళ్లలో రైతుల ఇబ్బందులు
- తాటిపాక సెంటర్‌లో ధాన్యం లోడు ట్రాక్టర్లతో ఆందోళన

రాజోలు: ధాన్యం కొనుగోళ్లు చేయడంలో ప్రభుత్వ ఆంక్షలు తొలగించాలని రైతులు తాటిపాక సెంటర్‌లో నిరసన వ్యక్తం చేశారు. బుధవారం ధాన్యం కొనుగోలు చేయడం లేదని ట్రాక్టర్ల ధాన్యంలోడుతో నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన చేపట్టారు. గ్రామాల వారీగా ధాన్యం కొనుగోలు చేసేందుకు లక్ష్యాలను ఇచ్చి కొనుగోలు లక్ష్యం పూర్తయిపోయిందని, ప్రైవేటు వ్యాపారులకు, మిల్లర్లకు ధాన్యం అమ్ముకోవాలని వ్యవసాయ అధికారులు రైతులు చెబుతున్నారన్నారు. రైతులు చేపట్టిన ఆందోళనకు కౌలు రైతు సంఘం మద్దతు తెలిపింది. మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు రైతులు చేపట్టిన నిరసనకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గొల్లపల్లి సూర్యారావు మాట్లాడుతూ రైతులు ఎంతో కష్టించి ధాన్యం పండిస్తే దానిని కొనుగోలు చేయడంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. గత ప్రభుత్వ హయాంలో ధాన్యం పూర్తిస్థాయిలో కొనుగోలు చేసి ప్రభుత్వం రైతులకు అండగా నిలిచిందన్నారు. ప్రస్తుతం ప్రైవేటు వ్యాపారులు, దళారులు, రైస్ మిల్లర్లకు అనుకూలంగా ప్రభుత్వం నిబంధనలు పెట్టి రైతులకు అన్యాయం చేస్తుందన్నారు. ప్రభుత్వ నిర్ణయించిన ధరకు రూ.150 తక్కువగా ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేయడంతో రైతులు నష్టపోతున్నారన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా ప్రభుత్వమే ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కౌలు రైతు సంఘ నాయకుడు పీతల రామచంద్రరావు మాట్లాడుతూ ప్రభుత్వం ధాన్యం కొనుగోలు దళారీలకు అప్పగించవద్దని, ప్రభుత్వమే కొనుగోలు చేయాలన్నారు. రైతులు గుబ్బల నాగరాజు, ఎంపీటీసీ జవ్వాది సత్తిబాబు, చిట్టూరి నాగరాజు, గూటం వెంకటేష్, కలిగితి రాజు, నక్కా సత్యనారాయణ, బొక్కా శ్రీరామ్మూర్తి, గంధం శ్రీను, గూటం రాజేష్, జిల్లెళ్ల శ్రీను, ఉల్లూరి రాజు తదితరులు పాల్గొన్నారు విప్పర్తి బాబి, కలిగితి దిలిప్, నేదూరి ఈశ్వర రావు, దొంగ సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం


రాజోలు పార్టీ కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: ఎన్నికల హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. బుధవారం రాజోలు గ్రామశాఖ అధ్యక్షుడు అడబాల జానకీరామ్ అధ్యక్షతన ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి ఇంటి వద్ద సమావేశం జరిగింది. గొల్లపల్లి మాట్లాడుతూ సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కేవలం పింఛన్లు ఇచ్చి కాలం గడుపుతుందన్నారు. ప్రజలకు ఇచ్చిన ఎన్నికల వాగ్దానాలను ధైర్యంగా అమలు చేయాలన్నారు. ఏటా ఎన్నికల హామీల అమలుపై శ్వేతపత్రం విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు అమలు చేస్తుందని ప్రజలు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారని, ముఖ్యమంత్రి చంద్రబాబు హామీను అమలు చేయకుండా కాలం గడుపుతున్నారన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తి కావస్తున్నా ఎలాంటి సంక్షేమ పథకాలు ప్రజలకు అందకపోవడం దురదృష్టకరమన్నారు. గ్రామస్థాయిలో వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడంతో పాటు ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు గొల్లపల్లి సూచించారు. జిల్లా అధికార ప్రతినిధి ఉచ్చుల విష్ణుమూర్తి, సర్పంచ్ రేవు జ్యోతి, ఎంపీటీసీ చెల్లింగి లక్ష్మీఈశ్వరి, దార్ల పెదబాబు, తెన్నేటి కిషోర్, ఉచ్చుల దాసు, బొడ్డపల్లి ప్రసాద్, గొల్ల చిన్ని, మట్టా నరసింహస్వామి, రాయవలస ప్రసాద్, మండల ఎస్సీ సెల్ అధ్యక్షుడు బుంగ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

కవులు, కళాకారులకు ఘన సత్కారం


వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న వారిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి తదితరులు

పి.గన్నవరం: మాజీ ఎమ్మెల్యే దివంగత నీతిపూడి గణపతిరావు బడుగు, బలహీన వర్గాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. మమత స్వచ్ఛంద సేవా సమితి అధ్యక్షుడు కోరుకొండ జాన్ ఆధ్వర్యంలో స్థానిక బీవీఆర్ కాంప్లెక్స్‌లో కార్మిక దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే గణపతిరావు సేవా పురస్కారాలను ఎమ్మెల్యే గిడ్డి, మాజీ ఎమ్మెల్యేలు పాముల రాజేశ్వరీదేవి, మానేపల్లి అయ్యాజీవేమా, ఏపీ ఎస్పీఎఫ్ కామాండెంట్ డాక్టర్ కొండా నర్సింహారావు చేతుల మీదుగా వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న ప్రముఖులకు అందజేశారు. కవులు, కళాకారులు, రచయితలు, రక్తదాతలు, వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మొత్తం 78 మందికి ఈ సేవా పురస్కారాన్ని అందించి, సత్కరించారు. తొలుత నీతిపూడి చిత్ర పటానికి ఆయన మనుమడు గణపతిరావు పూలమాలలు వేసి, నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మాట్లాడుతూ గణపతిరావు పేదల అభ్యున్నతికి నిరంతరం పాటుబడ్డారని అన్నారు. జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ అరిగెల బలరామమూర్తి, అబ్దుల్ కలాం ట్రస్టు చైర్మన్ భీమాల వెంకటేశ్వరరావు, కోట రామ్మోహన్‌రావు, బీవీవీ సత్యనారాయణ, మంగం సత్యనారాయణ, తోలేటి సుబ్బారావు, పాబోలు సత్యనారాయణ, నల్లా పెదకాపు తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన సేవలందించిన వారికి గుర్తింపు


కలెక్టరేట్‌లో తహసీల్దార్ ఆచార్యులును సన్మానిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

మామిడికుదురు: మెరుగైన సేవలందించిన అధికారులకు ప్రజల్లో మంచి గుర్తింపు లభిస్తుందని కోనసీమ జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ తెలిపారు. మామిడికుదురు తహసీల్దార్ ఉద్యోగ విరమణ సందర్భంగా బుధవారం అమలాపురం కలెక్టరేట్‌లో తహసీల్దార్ వైవీ సుబ్రహ్మణ్యం ఆచారిని కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఉన్నత విద్యనభ్యసించి ప్రభుత్వ పరిపాలనలో కీలకమైన రెవెన్యూ విభాగంలో అమూల్యమైన సేవలందించిన ఘనత ఆచార్యులకు దక్కుతుందన్నారు. డీఆర్వో రాజకుమారి, కలెక్టరేట్ ఏఓ విశ్వేశ్వరరావు, తదితరులు తహసీల్దార్‌కు జ్ఞాపికలు అందించి, శాలువాలతో సత్కరించారు. మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద జరిగిన ఉద్యోగ విరమణ సభలో ప్రజా ప్రతినిధులు, పలువురు ఉద్యోగులు తహసీల్దార్ ఆచార్యులను ఘనంగా సత్కరించారు. విధి నిర్వహణలో ఉత్తమ సేవలందించారని అభినందించారు.

నిబద్ధతతో పని చేసే వారికే గుర్తింపు


క్రాపలో బాలనారాయణ దంపతులను సత్కరిస్తున్న రెవెన్యూ అధికారులు, పలువురు ప్రజా ప్రతినిధులు

అయినవిల్లి: వృత్తిలో నిబద్ధతతో పనిచేసి వారికే గుర్తింపు లభిస్తుందని డిప్యూటీ తహసీల్దార్ (డీటీ) డి.శ్రీనివాసరావు అన్నారు. బుధవారం క్రాప, శంకరాయగూడెం గ్రామాల వీఆర్వోగా పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన వడ్డి బాలనారాయణ దంపతులను డీటీ శ్రీనివాసరావు సత్కరించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ ఉద్యోగికి ఉండవలసిన లక్షణాల్లో ఓపిక, తీరిక ఉండాలన్నారు. కర్తవ్య దీక్షతో పని చేయాలన్నారు. క్రాప, శంకరాయగూడెం సర్పంచులు బొక్కా కామేశ్వరరావు, బొబ్బిలి సీతాదేవి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. వీఆర్వోల సంఘ నాయకులు ఈతకోట వీవీ సత్యనారాయణ, నామాడి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

అన్న సంతర్పణ

మలికిపురం: మలికిపురంలో వేంచేసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద బుధవారం భారీ అన్న సంతర్పణ జరిగింది. ఆలయ తీర్థ మహోత్సవాల ముగింపు సందర్భంగా ఈ కార్యక్రమం జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

ఈదురు గాలులు.. వర్షపు జల్లులు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం సాయంకాలం కురిసిన వర్షం, ఈదురు గాలుల వల్ల జనజీవనం స్తంభించింది. ఏకధాటిగా సుమారు ఒక గంట పాటు కురిసిన వర్షం, వీచిన గాలులు అంతటా భీభత్సం సృష్టించింది. ఇటుక బట్టీల కళ్లాల మీద ఉన్న ఇటుక తడిసి ముద్దవడంతో యజమానులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అలాగే రబీ పంటలో పండించిన ధాన్యాన్ని తేమ తగ్గించుకునేందుకు ఆరుబయట ఆరబెట్టుకున్న రైతులకు హడావుడిగా కళ్లాల మీద ఉన్న ధాన్యాన్ని రాశులుగా చేసుకుని బరకాలు కప్పుకున్నారు. కొన్ని ధాన్యం రాశుల్లోకి వర్షపునీరు వెళ్లడంతో రైతులు తీవ్ర ఆందోళన పడుతున్నారు. ఈ అకాల వర్షాలకు తీవ్రంగా నష్టం వాటిల్లిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

పాముకాటుకు వృద్ధురాలి మృతి


నాయుడు లక్ష్మి

సఖినేటిపల్లి: పాముకాటుకు గురై రామేశ్వరం బోను సెంటర్‌కు చెందిన నాయుడు లక్ష్మి (79) మృతి చెందింది. ఈ నెల 29వ తేదీన రాత్రి ఇంటి అరుగుపై కూర్చుని ఉండగా నాయుడు లక్ష్మి పాము కాటుకు గురైంది. దీంతో ఆమెను రాజోలు ప్రభుత్వాస్పత్రికి తరలించగా అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. ఆమె కుమారుడు కొండబాబు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు సఖినేటిపల్లి ఎస్సై దుర్గా శ్రీనివాసరావు తెలిపారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జగ్గిరెడ్డిని కలసిన కప్పల శ్రీధర్

కొత్తపేట: జిల్లాలో వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేస్తానని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమితులైన కప్పల శ్రీధర్ అన్నారు. బుధవారం ఆయన తన నియామకం విషయాన్ని తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధిగా నియమింపబడిన అనంతరం ఈ నెల 28న గుంటూరు జిల్లా తాడేపల్లిలోని పార్టీ సెంట్రల్ ఆఫీస్‌లో రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ జిల్లా అధికార ప్రతినిధుల వర్క్‌షాప్‌లో పాల్గొని బాధ్యతలు చేపట్టినట్టు శ్రీధర్ తెలిపారు. నియామకం అనంతరం తొలిసారిగా హైదరాబాద్‌లో ఉన్న జిల్లా పార్టీ అధ్యక్షుడు, కొత్తపేట మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి కృతజ్ఞతలు తెలియజేశానన్నారు. జగ్గిరెడ్డి అభినందిస్తూ శక్తివంచన లేకుండా పార్టీ బలోపేతానికి కృషి చేయాలని, తద్వారా 2029లో పార్టీ అధినేత జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని, అందుకు తన సహాయ సహకారాలు, పూర్తి తోడ్పాటు అందిస్తానని భరోసా ఇచ్చారన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్సీ విభాగం అధ్యక్షుడు గొల్లపల్లి డేవిడ్‌రాజు, కొత్తపేట ఎంపీపీ మార్గన గంగాధరరావు, పార్టీ నాయకులు కర్రి నాగిరెడ్డి, ముసునూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీనృసింహస్వామికి అభిషేకం


చింతలూరులో నిర్వహించిన లక్ష్మీనృసింహస్వామి చందనాభిషేకం

ఆలమూరు: మండలంలోని చింతలూరులో వేంచేసిన శ్రీ, భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం శ్రీలక్ష్మీనృసింహస్వామి అభిషేకం భక్తిశ్రద్ధలతో జరిగింది. అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని ఆలయ ప్రధాన అర్చకుడు పెదపూడి సత్యనారాయణ ఆచార్యుల ఆధ్వర్యంలో పురోహితుల బృందం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించింది. ఆలయ ఆవరణలో కుంకుమ, హరిద్ర, చందనంతో నిర్వహించిన అభిషేకం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు వచ్చి స్వామి వారి కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తి పారవశ్యం పొందారు. హరే శ్రీనివాస, మహిళ భజన మండలి సభ్యులు ఆలపించిన శ్రీవిష్ణు సహస్రనామ పారాయణ భక్తులను మంత్రముగ్ధులను చేసింది.

వినూత్నంగా అక్షయ తృతీయ సేవ


ర్యాలిలో కుండ, గొడుగు, పండ్లు పంపిణీ చేస్తున్న మోహిత్‌సీత

కొత్తపేట: అక్షయ తృతీయ పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం ఆత్రేయపురం మండలం ర్యాలిలో వినూత్నంగా మట్టి కుండ, గొడుగు, మామిడిపండ్లు తదితర సరకుల పంపిణీ నిర్వహించారు. తొలుత గ్రామంలో వేంచేసిన కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర పుత్ర శక్తి గణపతి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రధాన అర్చకుడు ప్రసాద్ మాట్లాడుతూ అక్షయ తృతీయ అంటే బంగారం కొనుక్కోవడం కాదు పదిమందికి సహాయం చేయడం అదే మన అనాదిగా వస్తున్న ఆచారమని తెలిపారు. అక్షయ తృతీయ రోజున మట్టి కుండలో నీళ్లు, విసనకర్రలు, మామిడిపండ్లు, గొడుగులు, కాళ్లకు జోళ్లు, నిత్యావసరాలు, బాటసారులకు మజ్జిగ పంపిణీ వంటి కార్యక్రమాలు చేయాలని సూచించారు. ఆ మేరకు అన్నపూర్ణ శేఖర్, మచ్చ కుమార్‌రాజా సమకూర్చిన మట్టి కుండలు, విసనకర్ర, నిత్యవసరాలు, మామిడి పండ్లు, పుచ్చకాయ జ్యూస్, మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో లండన్ ఫిజియోథెరపిస్ట్ మోహిత్ సీత, చింతా శ్యామ్, అన్నపూర్ణ, తేజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వీరేశ్వరుడికి ‘బ్రహ్మోత్సవం’

- ఐదురోజుల పాటు నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు

ఐ.పోలవరం: నిత్యకల్యాణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న మురమళ్ల భద్రకాళి సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 1 గురువారం నుంచి 5 సోమవారం వరకూ ఐదు రోజుల పాటు బ్రహ్మోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు తుది దశకు చేరుకున్నాయి. భద్రకాళి సమేత వీరేశ్వరస్వామికి పాంచాహ్నిక దీక్షతో శైవాగమ శాస్త్ర ప్రకారం ఐదు రోజుల పాటు ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. శైవాగమ పండితుడి ఆదిశైవ అర్చక సంఘ రాష్ట్ర అధ్యక్షుడు యనమండ్ర సత్య సీతారామశర్మ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుని పర్యవేక్షణలో ఉత్సవాలు నిర్వహించనున్నారు. 1వ తేదీన గణపతి పూజ, పంచాగవ్యారధన, దీక్షా ధారణ, అభిషేకాలు, నూతన వధూవరులుగా అలంకరణ, ధ్వజారోహణ, సాయంత్రం భద్ర పీఠంపై గ్రామోత్సవం, ఆలయ ప్రదక్షిణ, స్వామి, అమ్మవార్లకు బ్రహ్మోత్సవ కల్యాణం 2న లక్ష్మీగణపతి హోమం, ప్రధాన కలశారధన, వాస్తు పూజ, సాయంత్రం చంద్రప్రభ వాహనంపై ఊరేగింపు, 3న పంచవింశతి కలశ స్థాపన పూర్వక అభిషేకం, సరస్వతీ హోమం, రుద్రహోమం, సాయంత్రం సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం, 4న గవ్యాంతము, చండీహోమం, కళాహోమాలు, సాయంత్రం నంది వాహనంపై గ్రామోత్సవం, 5న పూర్ణాహుతి, వసంతోత్సవం, వృద్ధ గౌతమీ నదిలో త్రిశూలస్నానం, స్వామి, అమ్మవారిని రథంపై ఊరేగింపు, పుష్పోత్సవం, పవళింపు సేవ, నిర్వహించనున్నారు.